# డ్యూటీ

ఆదివారం - ఉదయం - తొమ్మిదిన్నర నుండి పదింబావుదాకా చాలా విశిష్టమైన కాలం చాలామందికి.

టివీలో రామాయణం వస్తుంది.

ఆ యింటిలోని వారంతా - ఆ హాలులోని టివీకి అతుక్కుపోయారు.

రాముని చేతిలో వాలి వధ జరిగింది. సీత కోసమైతే - తనని శరణుజొచ్చితే - తన పరాక్రమముతో రావణాసురుని మట్టికరిపించి - సీతను రామునికి అప్పచెప్పేవాడినని వాపోయాడు వాలి. నిరపరాధినైన తనను దారుణంగా హత్యచేశాడని రాముని తూలనాడాడు.

చిరునవ్వుతో రాముడు వాలికి ధర్మోపదేశం చేశాడు. డాక్టర్ వర్మకు అది బాగా నచ్చింది.... వాలి ధర్మపథం తప్పి నేరం చేసి శిక్షార్హుడయ్యాడని రాముడు చెప్పడం.

"పిల్లలూ! చూశారా? రాముడు చెప్పింది విన్నారా? మనం ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలి. ఎవరైతే వారి ధర్మాన్ని తప్పుతారో వారిని దేవుడు క్షమించడు" అని చెప్పాడు వర్మ.

"డాడీ! ధర్మం అంటే...?"

"ధర్మం అంటే.... నీ పని నువ్వు చెయ్యడం.... స్కూల్లో వర్క్ ఇచ్చారనుకో దానిని సక్రమంగా పూర్తిగా చెయ్యాలి - అది చెయ్యకుండా ఆటలు ఆడుతున్నావనుకో.... అప్పుడ మీ టీచర్ ఏం చేస్తుంది? నిన్ను దండిస్తుంది. అది!"

"ఓ... ధర్మం అంటే బెత్తం తీసుకుకొట్టడం అన్నమాట." ఆరేళ్ళబాబు చెప్పాడు.

"ఛ! అదికాదు!.... మనకి ఇచ్చిన (పని) వర్క్ మనం చెయ్యడం." పాప చెప్పింది.

"కాబట్టి ఎవరు చేయవలసిన పనిని వాళ్ళే పూర్తిగా సంతోషంగా చెయ్యాలి. చేస్తేనే అందం " డాక్టర్ వర్మ చెప్పాడు. రామాయణం అయిపోయినా దాని ప్రభావం నుండి ఇంకా తేరుకోలేదు అందరూ.

"ఇన్నాళ్ళకి చక్కటి సీరియల్ చూస్తున్నాం" అర్ధాంగి పారిజాతం చెప్పింది.

"యావద్భారతదేశాన్ని ఏకసూత్రంగా నడిపిస్తున్న సీరియల్! సారీ!

రామాయణం నీకు తెలుసా.... అది మన భిన్నత్వంలో ఏకత్వానికి మూలకారణం రామాయణమే. వివిధ పుష్పాలతో సూత్రంలాగా రామాయణనీతి-ధర్మం మన ప్రజల్ని నడిపిస్తూ మనలో ఎన్ని విభిన్న దృక్పథాలున్నా మనల్ని కలిసి వుండేలా చేస్తోంది." లెక్చరిచ్చాడు డాక్టర్ వర్మ.

"అదికాదు. మనలోని మానవత్వాన్ని తట్టి లేపుతూ... మనిషి ధర్మాన్ని సక్రమంగా

నిర్వర్తించేలా చేస్తూ వారి నడవడికను నిర్దేశిస్తున్నది." పారిజాతం తందానా అంది.

"మహానుభావుడు రామానందసాగర్! మనల్ని ఆనందసాగరంలో ముంచుతున్నాడు. సీతమ్మ తల్లిని, రామయ్య తండ్రిని దర్శనం చేయిస్తూ పాపాల్ని పోగొడుతున్నాడు." నాయనమ్మ భక్తిపారవశ్యంగా అంది.

"ఏమైనా వాల్మీకి మంచి రైటరండి-రసపోషణ-పాత్ర సృష్టి-దేశకాల పరిస్థితులు చక్కగా విశదీకరించాడు" ఓ చిన్న రచయిత చూడ్డానికి వచ్చి మెచ్చుకున్నాడు.

"అయినా నాకో సందేహం.... వాలి అంతటి వీరుడు-శూరుడు... అసలు వుండేవాడా? అని" సందేహం వ్యక్తం చేశాడు పొరుగింటి పుల్లయ్య.

డాక్టర్ వర్మకు వారి అజ్ఞానాన్ని చూస్తే జాలికలిగింది. కోపం వచ్చింది - ఆవేశం రగిలింది మళ్ళీ ఉపన్యాసం అందుకున్నాడు.

"రామాయణం కల్పితమా? యదార్ధమా! వాల్మీకి రాశాడా

ఇవన్నీ కాదు మనకి కావాల్సింది వాలి సప్తసముద్రాలు ఎలా దాటాడు?

ఇదికాదు ప్రశ్న.... మనకి కావలసింది వారి బిహేవియర్! ప్రవర్తన... సైకాలజీ-వారి మానసిక పరిపక్వత-వాల్మీకి తన రచనలో ప్రతి పాత్రనీ ఒక విశిష్ట శైలిలో ప్రవేశపెట్టి మానవాళికి ఆదర్శ ప్రవర్తనని నిర్దేశించాడు.

అన్నదమ్ముల అనుబంధం రామలక్ష్మణులవలే.. భరతులకు వలే వుండాలి.

స్వామిభక్తి హనుమంతునివలే ఉండాలని... భార్యభర్తల అనుబంధం సీతా రాములలాగా ఉండాలని... అలాగే మహాబలాఢ్యులైన రావణాసురుడు... వాలి.... ఎలా? ఎందుకు నాశనమయ్యారు? వారి వారి స్వయంకృతాపరాధముల వలన, వారి ధర్మాలను వారు మరచి విచ్చలవిడిగా జీవితాన్ని తమ యిష్టం వచ్చిన రీతిలో నడిపించాలని ఉవ్విళ్ళూరారు. దానివలన వినాశనం తెచ్చుకున్నారు. అర్ధం అయిందా! మనకి కావలసినది ఇది. మనం నేర్చుకోవలసినది మన కర్తవ్యపాలన, ధర్మనిర్వహణ అర్ధం అయ్యిందా?" అంటూ తాను తను మరచిన ధర్మాన్ని గుర్తు తెచ్చుకుంటూ బయలుదేరబోయాడు వర్మ.

"అయ్యో! ఇదేమిటండీ! ఫోన్ రిసీవర్ అలా ప్రక్కన పెట్టేసింది ఎవరండీ?" పారిజాతం విసుక్కుంటూ ఫోన్ రిసీవర్ క్రెడిల్ చేసింది."

"ఆ! నేనే రామాయణం చూసేటప్పుడు డిస్టర్బెన్స్ వస్తుందని ఎందుకని... నేనే ప్రక్కన పెట్టేశాను" పెద్ద ఘనకార్యం చేసినట్లు చెప్పాడు.

ఇంతలో నర్సు హడావుడిగా ఒగర్చుకుంటూ వచ్చింది.

"హల్లో! సిస్టర్! కొంచెం ముందర వచ్చుంటే చూసే అదృష్టం కలిగివుండేది." వర్మ ఆప్యాయంగా అన్నాడు.

"సారీ సార్! బెడ్ నెంబర్ పదమూడు పేషంట్‌కి సీరియస్‌గా ఉంది సార్!" నర్స్ కంగారుగా అంది.

"ఏమైంది?" ఆదుర్ధాగా అడిగాడు వర్మ.

"ఇంతదాకా బాగానే ఉన్నాడు! సడెన్‌గా పల్స్‌డౌన్ అయింది సర్!"... ఊపిరి పీల్చడం కష్టంగా ఉంటే ఆక్సిజన్ పెట్టాను."

"మరి డాక్టర్ ఇందిర ఏమి ట్రీట్‌మెంట్ ఇచ్చింది?"

"ఆమె లేదుసార్!""

"వ్వాట్! ఎక్కడికి వెళ్ళింది? డ్యూటి టైములో. " "అర్జెంటు పని వుందని యింటికెళ్ళిందిసార్!"

"నాన్సెన్స్! సీరియస్‌గా ఉన్న పేషంట్‌ని చూడకుండా... యిర్రెస్పాన్సిబుల్! కోపంగా అన్నాడు డాక్టర్ వర్మ. "మీరొస్తారని ఎదురుచూస్తూ...." నర్సు.

"ఎదురుచూడ్డం ఎందుకు? ఫోన్ చెయ్యచ్చుగా? కోపంగా అడిగాడు బూట్లు తొడుక్కుంటూ!

"చాలా సేపు ట్రై చేశాను సార్. ఎంగేజ్డ్ సౌండ్ వచ్చింది అందుకని మిమ్మల్ని పిలవడానికి పేషంట్ బంధువులు ఎవరో లిఫ్ట్ ఇస్తే వచ్చాను సార్!" నిస్సహాయంగా చెప్పింది.

డాక్టర్ వర్మ మరేమీ మాట్లాడలేక త్వరగా బయటకు వచ్చి స్కూటర్ స్టార్ట్‌చేసి బయలుదేరాడు హాస్పిటల్‌కి ఆతృతగా.

వార్డులో 13వ నెంబరు బెడ్ ప్రక్కన అతని భార్య హృదయవిదారకంగా ఏడుస్తోంది.

డాక్టర్ వర్మ పల్స్ చూశాడు.

చిలక ఎగిరిపోయింది.

సిస్టర్ మౌనంగా ఆపాదమస్తకం దుప్పటి కప్పేసింది. అది చూసిన అతని భార్య గుండెలు పగిలేలా ఏడుస్తూ తన నిస్సహాయతతో చూస్తూ ఉంది.

"ప్చ్! ఋణం తీరిపోయింది" భారంగా నిట్టూర్చి వర్మ ముందుకి కదిలాడు.

"డాక్టర్! మీరు రామాయణం చూడడానికి ఇంటికి వెళ్ళకుండా ఉంటే ఇక్కడ ఈ పేషెంటకి టైముకి ట్రీట్‌మెంట్ సరిగా జరిగి బ్రతికి వుండేవాడు." పేషెంట్ రిలేటివ్ అన్నాడు.

బాధగా "అతని మరణానికి బాధ్యత మీదే!" అంటూ కూలబడి పోయాడు.

డాక్టర్ వర్మ తన గదిలోకి వచ్చినా అతని మనసు ధర్మనిర్వహణపట్ల అశ్రద్ధని గుర్తించి బరువుగా వుంది. అతని కళ్ళ ముందు టి.వీ.రాముడు కన్పిస్తున్నాడు - నువ్వు నీ వృత్తిధర్మాన్ని తప్పావు అంటూ. "నీ డ్యూటీ నువ్వు తప్పిననాడు నువ్వు ధర్మాన్ని ఆచరించినవాడివిగాదు" అన్నట్లనిపించింది.